ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
ఆదివారం 16 ఫిబ్రవరి 2025



న్యూస్ బాక్స్

బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్

కోనరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన కొల్లాపూరు వేణుగోపాల్ వెంకట్రావుపేటకు చెందిన కదిరే శ్రీనివాస్‌గౌడ్, తాటి చెట్టు మీద నుంచి పడి మరణించిన నిమ్మపల్లి గ్రామానికి చెందిన దొంతర వేణి రాజారాంగౌడ్, కొత్తకొండ దేవయ్య, మండలానికి కేంద్రానికి చెందిన మంగళిపెల్లి బాలయ్య, దుర్ల మొగులయ్య, దండెం నర్సయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, చేపూరి గంగాధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మానక సత్యం తదితరుల ఉన్నారు.

పేదలపై ఆర్థిక భారం పడకుండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలపై ఆర్థికభారం పడకుండా ప్రభుత్వం మంజూరుచేస్తున్న రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నామని గృహ నిర్మాణ శాఖ పీడీ చిన్నయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం వెనుక నిర్మించతలపెట్టిన మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శనివారం ఆయన స్థల పరిశీలన చేశారు. ఇంటి నిర్మాణ నమూనాను వివరించారు. ప్రభుత్వం కేటాయిస్తున్న రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందన్నారు. మొదటగా మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు చూపనున్నామని తెలిపారు. డీఈ భాస్కర్, ఏఈ హమీద్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, బాబు, లచ్చిరెడ్డి, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' యాక్షన్ ప్లాన్ సిద్ధం



- 2025-2026 సంవత్సరానికి 26.75 లక్షల పనిదినాల లక్ష్యం
- రూ.80.26 కోట్ల బడ్జెట్
- ఈసారి స్థానిక అవసరాల పనులపై దృష్టి
- గ్రామసభల్లో ఉపాధిహామీ పనుల గుర్తింపు
- జిల్లాలో 2 లక్షల మంది ఉపాధి కూలీలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గ్రామీణులకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఉపాధిని అందిస్తున్నది. ఈ పథకం ద్వారా గ్రామాల్లోని కూలీలు వలసలు వెళ్లకుండా నియంత్రిస్తూ వారికి గ్రామంలోనే ఉపాధిని అందించడానికి పనులు చేపడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనిదినాలు కల్పించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. రూ.80.26 కోట్ల బడ్జెట్ అంచనా వేశారు. కూలీల బడ్జెట్ రూపకల్పనలో జిల్లాలోని 255 గ్రామాల్లో సభలను నిర్వహించి పనులను గుర్తించారు. గతంలో ఉపాధి పనులు ఇష్టానుసారంగా జరిగిన క్రమంలో కేంద్ర ప్రభుత్వం పాత విధానానికి స్వస్తి పలికి కొత్త విధానాన్ని ముందుకు తీసుకవచ్చింది. ఉపాధి పనులపై సామాజిక తనిఖీలతో కేంద్రం పూర్తిగా నిఘాను పెంచింది. ఇప్పటికే నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) సర్వర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధిహామీ కూలీలకు నేరుగా వారి ఖాతాల్లోనే కూలిని జమ చేస్తుంది.

స్థానిక అవసరాలపై దృష్టి..

గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అవసరాలు, ప్రాధాన్యత మేరకు సుస్థిర ఆస్తుల కల్పనకు అవసరమైన పనులను గ్రామ సభల్లో గుర్తించారు. గ్రామంలో ఉన్న నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూరే విధంగా 60 శాతానికి తగ్గకుండా మండల స్థాయిలో వ్యవసాయ సంబంధిత పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. గ్రామాల వారీగా పనులను గుర్తించి మిగతా 8వ పేజీలో

ఇప్పటివరకు 21.78 లక్షల పనిదినాలు పూర్తి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్‌లో 27.55 లక్షల పనిదినాల్లో 21.78 లక్షల పనిదినాలు పూర్తి చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి లక్ష్యం చేరే విధంగా ప్రణాళికలు ఏర్పాటు చేశారు. జిల్లాలో కూలీలు సరాసరిగా రూ.229.56 వేతనాన్ని పొందుతున్నారు. జిల్లాలో 783 కుటుంబాలు వంద రోజుల పని దినాలను పూర్తి చేశారు. జిల్లాలో వేతనాల కింద రూ.47.58 కోట్లు పొందారు. మెటీరియల్ ఖర్చు రూ. 23.81 కోట్లు చేశారు. జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 98 వేల జాబ్ కార్డులు ఉండగా, కూలీలు 2 లక్షల మంది ఉన్నారు. ఇందులో 64వేల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. నిత్యం ఉపాధి పొందుతున్న కూలీలు లక్ష మంది వరకు ఉన్నారు.

2025-26 ఆర్థిక సంవత్సరం లేబర్ బడ్జెట్ పనిదినాలు

మండలం	పనిదినాలు
బోయినపల్లి	1,40,710
చందుర్తి	2,44,424
ఇల్లంతకుంట	2,63,735
గంభీరావుపేట	3,66,733
కోనరావుపేట	3,02,552
ముస్తాబాద్	2,51,286
రుద్రంగి	69,347
తంగళ్లపల్లి	3,34,000
వీర్నపల్లి	2,35,000
వేములవాడ	45,200
వేములవాడ రూరల్	1,46,730
ఎల్లారెడ్డిపేట	2,75,666
మొత్తం	26,75,383



బెండకాయలు తెంపుతున్న రైతు గోపాల్

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు..

- కూరగాయల సేద్యంతో అదనపు ఆదాయం పొందుతున్న రైతు గోపాల్

6



రుద్రంగి మండలం బడితండాలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

- పలుచోట్ల ప్రత్యేక పూజలు
- నివాళులు అర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

8

సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలి

- ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మల్లారం రహదారిలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ సేవలు చీరస్మరణీయమని కొనియాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో త్యాగాలు చేసిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ప్రతి ఏడాది నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ ఈర్యానాయక్, కోకన్వీనర్ గుగులోతు తిరుపతినాయక్, సోమలాల్, అగస్‌లాల్, మదన్‌లాల్, నరేష్, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐ కార్యాలయ భవన పైకప్పునకు మరమ్మతులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మరమ్మతు పనులు చేస్తున్న కూలీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ కార్యాలయ భవనం పైకప్పునకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రమాదకరంగా మారిన సీఐ కార్యాలయ భవన పరిస్థితిపై ఈనెల 5న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ప్రమాదకరంగా సీఐ కార్యాలయ భవనం పైకప్పు' అనే కథనానికి సీఐ శ్రీనివాస్‌గౌడ్ శనివారం స్పందించారు. భవనం పైకప్పు మరమ్మతు పనులను చేపట్టారు. భవనాన్ని ఆధునీకరిస్తామని సీఐ వెల్లడించారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పెరటి కోళ్ల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సెర్ప్ కార్యాలయంలో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏపీఎం, సీసీలకు పెరటి కోళ్ల పెంపకం, ఆరోగ్యం, పౌష్టికాహారం పరిశుభ్రత కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టే పెరటికోళ్ల పెంపకాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లి కోళ్లను పెంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి వెయ్యి రోజుల ప్రణాళికలో చేతులు శుభ్రంగా కడుక్కోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. అడిషనల్ డీఆర్‌డీవో గొట్టె శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, డీపీఎం, ఏపీఎంలు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘానికి కుర్చీల వితరణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద లింగాపూర్ అంబేద్కర్ సంఘానికి యువజన నాయకుడు కేతిరెడ్డి నవీన్ రెడ్డి కుర్చీలను వితరణ చేశారు. సంఘ భవనంలో శనివారం జరిగిన కార్యక్రమంలో 16 కుర్చీలు, మ్యాట్, ఫ్యాన్‌లను అందించారు. అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు పసుల నరేష్, నాయకులు గన్నేరం నరసయ్య, కోలపురం మహేష్, కేతిరెడ్డి శరత్‌రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర

- ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

చందుర్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో ప్రధాన వీధులుల్లో గ్రామస్తుల, వ్యాపారుల, వివిధ కుల సంఘాలు, ట్రాక్టర్ యజమానుల సహకారంతో రూ.లక్షా30వేల రూపాయలు ఏర్పాటు చేసిన 8 కెమెరాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరించిన వివిధ కుల సంఘాలను, వ్యాపారస్తులను అభినందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య, పంచాయితీ కార్యదర్శి కవిత, నాయకులు మధు, హరిబాబు, కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

తెర వెనక నుంచి బీజేపీకి మద్దతిస్తున్న బీఆర్ఎస్..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బుర్ర రవితేజ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవమని తెలిసి బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకొని తెరవెనక బీజేపీకి మద్దతు ఇస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు బుర్ర రవితేజ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో నిరుద్యోగులు కొట్టిన దెబ్బకు బీఆర్ఎస్ పార్టీ పోటి చేయడానికి బయపడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీజేపీ పార్టీతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుందని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిననాటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నాటికి దాదాపు 50వేల ఉద్యోగాలు భర్తీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో దాదాపు 55143 ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. రాహుల్‌గాంధీ ఆశయాల మేరకు తెలంగాణలో కుల గణన చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు చర్యలు చేపడుతున్నారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కల్లో కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకట్‌రెడ్డి, శేఖర్, వివేక్, భగవాన్, రాజేష్, విశాల్, ప్రణీత్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల ఫ్లాష్ మాబ్..

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల వైద్య కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు పాటలు, నృత్యాలతో శనివారం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. వ్యసనాలకు దగ్గరై జీవితాలను నాశనం చేసుకుంటున్న యువతను మేల్కొలిపేందుకు సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో వైద్య విద్యార్థులు పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ్, ప్రభుత్వ ప్రధాన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నాగార్జున చక్రవర్తి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న వైద్య విద్యార్థులు

మెరుగైన వైద్య సేవలందించాలి..

వైద్య విద్యార్థులు భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శనివారం సాయంత్రం సిరిసిల్ల జిల్లా ప్రధాన వైద్యశాల ఆవరణలో వైద్య కళాశాల వార్షికోత్సవంతో పాటు నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 15 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందికి బహుమతులను ముఖ్య అతిథులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ అందించి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు అధ్యాపకులు దిశా నిర్దేశం చేస్తూ వైద్య విద్యనందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ్, ప్రభుత్వ ప్రధాన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పెంచలయ్య, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

పక్కా కార్యాచరణతో మాదక ద్రవ్యాల నియంత్రణ

- అవగాహన కార్యక్రమాలతో పాటు విస్తృత తనిఖీలు - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పక్కా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని కలెక్టర్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. డ్రగ్స్ నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలను ప్రతినెల తనిఖీచేయాలని సూచించారు. ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. జిల్లాలో గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయని, డ్రంకెన్ డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామని, గంజాయి పాజిటివ్ వచ్చిన వారి నుంచి సరఫరా దారులను పట్టుకుంటున్నామన్నారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, చిత్రంలో ఎస్పీ అఖిల్ మహాజన్

ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్ : జిల్లాలో ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇసుక రవాణాపై కలెక్టరేట్ నుంచి సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అనుమతి ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే తరలించాలని, వేబిల్, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమతి లేని వాగుల నుంచి ఇసుక తరలించకుండా నిఘా పెట్టాలన్నారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కేసులు పెట్టాలని, ఇసుక అక్రమంగా తరలించకుండా కందకాలు తవ్వించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయ్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌ను దొంగిలించిన ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువకుడు బొడ్డు నిఖిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని రాగట్లపల్లికి చెందిన నూకల సాయివంశీ ఈ నెల 13న అనారోగ్యంతో బాధపడుతూ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. తన రూ.25 వేల విలువైన సెల్‌ఫోన్‌ను పడకపై ఉంచి మూత్రశాలకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి సెల్‌ఫోన్ కనిపించలేదు. దాంతో సాయివంశీ పెద్దనాన్న మందాటి రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మండల కేంద్రంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన యువకుడు నిఖిల్‌ను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. అతడిని విచారించగా సాయివంశీకి సంబంధించిన సెల్‌ఫోన్‌ను తానే దొంగిలించానని నిఖిల్ అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరెడ్డిపల్లి గ్రామ శివారులో గంజాయి అమ్మడానికి వచ్చిన పున్ని వేణు అనే యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన వేణు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. గంజాయి అమ్మడం ద్వారా డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో శనివారం గంజాయి తీసుకొని ఇల్లంతకుంటకు వస్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద 600 గ్రాముల గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామానికి చెందిన రొండ్ల కిరణ్ రెడ్డి(38) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గ్రామస్థుల వివరాలు ప్రకారం.. కిరణ్‌రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి సిద్దిపేట నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. వాహనానికి అడ్డుగా అడవిపంది రావడంతో కిందపడి గాయాల పాలయ్యాడు. కిరణ్‌రెడ్డిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల హారిక(30)హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పెగడపల్లి ఎస్సై సీహెచ్. రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఈ నెల 13న హారిక వ్యక్తిగత కారణాలతో ఆమె 10ఏళ్ల కుమారుడు కృష్ణంత్, 8ఏళ్ల కూతురు మయాంతలక్ష్మి ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. చికిత్స కోసం హైదరాబాదుకు తరలించగా చికిత్స పొందుతూ హారిక మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు, కూతురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

మల్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలికను తీసుకెళ్లిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. జగిత్యాల మండలానికి చెందిన ఓ బాలిక(17) తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న బాలిక శనివారం వేకువజామున చూసే వరకు కనిపించకపోడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతర్గాంకు చెందిన యువకుడిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



కమెడియన్‌గా నటించాలని ఉంది

- విష్ణుగుప్త, జీహెచ్‌ఎస్, రాంనగర్

సీరియల్స్‌లో, సినిమాల్లో నటిస్తా... విలన్, కమెడియన్‌గా నటించాలని ఆసక్తిగా ఉంది. ప్రేమ, బాధ, దుఃఖం, కోపం, ధీరత్వం, అద్భుతం వంటి అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చారు.



స్టేజి ఫియర్ పోయింది..

- జి శశాంక్, ఎలగందుల మోడల్ హైస్కూల్

అమ్మ ప్రోత్సాహంతో నటనలో శిక్షణ పొందాను. స్టేజ్ ఫియర్ పోయింది. హీరోగా పాత్రలు ధరించాలని ఉంది. శిక్షణ బాగా అనిపించింది.

'రోల్ ప్లే'లో చిన్నారుల ప్రతిభ

కలెక్టర్ సహకారంతో నటనలో శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

● చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్‌లో ప్రదర్శన

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కళ అందరిలో దాగి ఉంటుంది. దాన్ని వెలికితీసే సందర్భాలు, ప్రోత్సాహం, శిక్షణ ఉంటే ఆయా కళలు బహిర్గతమవుతాయి. కలెక్టర్ పమేలా సత్పతి సూచనలతో కరీంనగర్‌కు చెందిన మోడ్రన్ యాక్టింగ్ స్కూల్ ఆఫ్ కరీంనగర్ (మాస్క్) చైర్మన్ అనసూరి భూనాథాచారి ఆధ్వర్యంలో 45 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోల్ ప్లే విభాగంలో శిక్షణ పొందారు. ఈ మేరకు శనివారం కళాభారతిలో జరిగిన చిల్డ్రన్ థియేటర్ ఫెస్టివల్‌లో చిన్నారులు నేర్చుకున్న నటనను ప్రదర్శించి అందరినీ అబ్బుర పరిచారు.

● అలరించిన ప్రదర్శనలు

కరీంనగర్ కళాభారతిలో చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్-2025 శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై చిన్నారుల ప్రదర్శనను తిలకించారు. అద్భుత నటనతో ఆకట్టుకున్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యాన్ని, సామాజిక స్పృహను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మాస్క్ చైర్మన్ అనసూరి భూనాథాచారి, సీకేబీ అధ్యక్ష కార్యదర్శులు తిప్పర్తి ప్రభు, మంచాల రమేశ్, తిప్పర్తి రమేశ్, జి కృపాదానం, గోపాల్‌రావు, గాజుల రవీందర్, నాంపెల్లి శ్రీనివాస్, ఎంఏ మతీన్, అయిలు రమేశ్, మాడిశెట్టి గోపాల్, చకిలం స్వప్న, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



బాలికల రోల్ ప్లే ప్రదర్శన



కళాభారతిలో చిన్నారుల రోల్ ప్లే ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

మంచి స్పందన వచ్చింది

- అనసూరి భూనాథాచారి, మాస్క్ చైర్మన్



తొలుత కలెక్టర్ మేడం చెప్పాక భయమేసింది. పిల్లలు వస్తారో రారో అనుకున్న. రెండు మూడు రోజుల్లోనే విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రోత్సాహం, సహకారం అందించిన కలెక్టర్‌కు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.



పాఠశాల తరుపున ప్రోత్సాహం అందించారు

- జి దివ్య, జీహెచ్‌ఎస్ సప్తగిరికాలని

అనతికాలంలో శిక్షణనిచ్చిన మాస్క్‌కు కృతజ్ఞతలు. ఇంకా నటన నేర్చుకోవాలనుకుంటున్నాను. పాఠశాల తరఫున ప్రోత్సాహం అందించారు. మదర్ క్యారెక్టర్ అంటే ఇష్టం. సీరియల్స్, షార్ట్ ఫిల్మ్స్, సినిమాల్లో నటించాలని ఉంది.



ఏ ప్రాత అయినా చేస్తా..

- ఎస్ కావ్య (10వ) జీహెచ్‌ఎస్ సప్తగిరికాలని

ఇన్నాళ్లు మాలో దాగిన కళ బయటకొచ్చింది. ఏ పాత్ర అయినా చేసేస్తా. ఇదివరకంటే ఇప్పుడు ధైర్యం, యాక్టీవ్‌గా మాట్లాడుతున్నా. ఇంట్లో, స్కూల్లో, నా తోటి మిత్రుల ప్రోత్సాహంతో నటన నేర్చుకున్నా.

ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆటో డ్రైవర్ బలి

● రూ.50 లక్షల వరకు అప్పు
● చెల్లించలేక ఆత్మహత్య



చొప్పరి దేవేందర్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ చొప్పరి దేవేందర్ (35) ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవేందర్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. కొన్నేళ్లుగా ఆడుతూ సుమారు రూ.50 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకోవడం, అప్పులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులతో శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి హుటాహుటిన గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స చేసేందుకు నిరాకరించడంతో దేవేందర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దేవేందర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు దేవేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడిపై తండ్రి ఫిర్యాదు

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌కు చెందిన గడ్డం రాజచంద్రశేఖర్‌రెడ్డికి కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇంట్లో వారిని, చుట్టు పక్కల వారిపై దాడులకు పాల్పడుతున్నాడు. దీంతో అతడి తండ్రి మహిపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి రాజచంద్రశేఖర్‌రెడ్డిని న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

● ఎండుతున్న పంటలు ● ఆందోళనలో రైతులు



ఎండుతున్న వరిపంటను చూపుతున్న రైతులు

గంభీరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాఫానగర్ గ్రామ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పంటలు ఎండుతున్నాయంటూ శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. లోవోల్టేజీ కారణంగా నెలలో రెండు సార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటలకు సాగునీటి ఇబ్బంది తలెత్తిందని వాపోయారు. చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలకు సాగునీరు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే మరమ్మతులు చేపట్టి పంటలను కాపాడాలని కోరారు. ఈ ఆందోళనలో రైతులు దేవయ్య, రాజయ్య, భూమయ్య, రాములు, శ్రీనివాస్, శేఖర్, కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలి

సిరిసిల్ల టౌన్ : ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గంభీరావుపేట మండలం ముస్తాఫానగర్ గ్రామ రైతులు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. ముస్తాఫానగర్‌లో 100 కేవీ కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై 130 కేవీ కెపాసిటీ భారం పడుతోందన్నారు. అనుమతి లేకుండా ఉన్న కనెక్షన్లు తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సెస్ అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రైతులు ఎండీ అక్బర్ ఖాన్, శివంది దేవయ్య, దోమకొండ భూమయ్య, కంటె దేవయ్య, దోమకొండ దేవయ్య, శివంది శ్రీనివాస్, బోదాస్ లక్ష్మయ్య, శివుని రాములు, శివంది కిషన్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

తంగళ్లపల్లి, (సిరిసిల్ల రూరల్) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ ఇందిరాపార్కులో శనివారం కుక్కలు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. ఇందిరమ్మ కాలనీ గ్రామంలో రోడ్డుపై ఆడుకుంటున్న ఓగులాపూర్ గ్రామానికి చెందిన చెల్ల శ్రీవర్ధన్(2)పై కుక్కలు దాడి చేశాయి. అడ్డుకునేందుకు వెళ్లిన ఆకుబత్తిని రుక్మంబాయి, అనురాధ, గౌడ సాన్విలతో పాటు మరికొందరిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. కుక్కల దాడిలో గాయపడ్డ వీరిని గ్రామస్థులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో పోలీసుస్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై వెళ్తున్న మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామ కారోబార్ బొల్లం శ్రీనివాస్‌ను, హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

కరెంట్ మోటార్ల దొంగల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కరెంటు మోటార్లు

మెట్‌పల్లి టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను శనివారం పోలీస్‌లు పట్టుకున్నారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా కోరుట్ల, మెట్‌పల్లి సర్కిల్ పోలీస్ పరిధిలో తాళం వేసిన ఇళ్లలో, వ్యవసాయ మోటార్లు అధిక సంఖ్యలో దొంగతనాలు జరుగుతున్నాయని నిందితులను పట్టుకునేందుకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు సీసీ పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఎస్సై అనిల్ వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన కుంచెపు వెంకటేష్, నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలోని ఎఆర్‌పి క్యాంపునకు చెందిన సూర్యవంశీ సాయికుమార్ ప్రస్తుతం రాఘవపేట గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్, మెట్‌పల్లికి చెందిన స్క్రాప్ వ్యాపారి అబ్దుల్ బారి ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో దొంగతనాలు చేసినట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి 6 లక్షల విలువ గల 1 మోటార్ సైకిల్, 30 కిలోల రాగి వైరు, 30 వ్యవసాయ కరెంట్ మోటార్లు 5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో కేసు చేధించిన మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్ ఎస్‌ఐలు అనిల్, కిరణ్, రాజు, సిబ్బంది చైతన్య, కిరణ్, అనిల్, సాధునాయక్, మారుతిలను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు

కూరగాయల సేద్యంతో అదనపు ఆదాయం పొందుతున్న రైతు గోపాల్



సాగు చేసిన కూరగాయాల తోట

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అతడో సాధారణ రైతు.. సంప్రదాయ పద్ధతిలో ఏటా వరి సాగుతో నష్టాలను చవిచూశాడు. దీంతో ఎలాగైన కష్టాల నుంచి గట్టెక్కాలని భావించాడు. ఉన్న కొద్దిపాటి భూమిలో కూరగాయలు పండించాలని నిర్ణయించుకున్నాడు. తనకున్న ఆరు గుంటల్లో 12 రకాల పంటలను వేశాడు. పెట్టుబడి పోను గత ఆరునెలల్లో రూ.30 వేల వరకు ఆదాయం సమకూరిందని హర్షం వ్యక్త చేస్తున్నాడు ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రైతు అంతెర్పుల గోపాల్.

● వేర్వేరు పంటల సాగు.

మండల కేంద్రానికి చెందిన రైతు అంతెర్పుల గోపాల్ గ్రామ శివారులో తనకున్న 11 గుంటల్లో వరి పంటను సాగు చేసినా దిగుబడి అంతంత మాత్రమే రావడంతో ఆలోచనలో పడ్డాడు. కుటుంబ పోషణ భారంగా మారినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేసినా ఫలితం లేకుండాపోయింది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే కూరగాయల పంటల సాగును ఐదేళ్ల క్రితం ప్రారంభించాడు. 1.11 ఎకరాల భూమిలో 1.05 ఎకరాల్లో వరి పంటను, మిగిలిన 6 గుంటల్లో 12 రకాల కూరగాయల పంటలను సాగు చేశాడు. గుంట విస్తీర్ణంలో మిరప, మరో గుంటలో బెండ, మిగతా భూమిలో అర గుంట చొప్పున నాలుగు గుంటల్లో టమాట, బీర, కాకర, వంకాయ, గోరుచిక్కుడు, అల్చింత, పాలకూర, మెంతి, కొత్తిమీరతో పాటు ఒడ్డుకు రెండు వైపులా సొరకాయ పంటలను పండిస్తున్నాడు. 12 రకాల పంటలకు గాను దున్నడం, విత్తనాల ఖర్చులకు రూ.10 వేల వరకు వెచ్చించాడు. రెండు రోజులకొకసారి తడులు పెడుతున్నాడు. పండిన కూరగాయలను తెంపి మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో జరిగే బుధ, శుక్ర, శనివారాల్లోని వార సంతల్లో విక్రయిస్తున్నాడు. పంట పెట్టుబడి పోను ఆరు నెల్లో రూ.30 వేల ఆదాయం సమకూరిందని రైతు గోపాల్ పేర్కొంటున్నాడు. ఒకే రకమైన పంటల సాగుతో కాకుండా వేర్వేరు రకాల పంటలను పండించడంతో నష్టాల నుంచి గట్టెక్కవచ్చనని గోపాల్ చెబుతున్నాడు.



కోతుల బెడదకు తోట చుట్టూ ఏర్పాటు చేసిన వల

అదనపు ఆదాయం పొందుతున్నా..

- అంతెర్పుల గోపాల్, రైతు

నాకున్న 11 గుంటల్లో మొదట వరి వేసేవాడిని. లాభం లేకుండాపోయింది. దాంతో పక్కనే ఉన్న ఎకరం భూమిని కౌలుకు తీసుకున్నాను. మొత్తం 1.11 ఎకరాల్లో 1.05 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను వేశాను. 6 గుంటల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నాను. కోతుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు తోట చుట్టూ వలను ఏర్పాటు చేశాను. వరి సాగుతో పా టు కూరగాయలను పండించడం వల్ల నెలకు రూ. 5వేల వరకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

ఆర్టీవో అధికారులు వేధిస్తున్నారని నిరసన

● లారీ పైకి ఎక్కి విద్యుత్ తీగలు పట్టుకుంటానని బెదిరింపు



లారీ ఎక్కి నిరసన తెలుపుతున్న అనీల్‌గౌడ్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) ఆర్టీవో అధికారులు మాముళ్ళ వసూలు చేస్తున్నారని శనివారం బసంత్‌నగర్‌కు చెందిన ముత్యం అనీల్‌గౌడ్ అనే లారీ ఓనర్ నిరసన తెలిపాడు. లారీ పైకి ఎక్కి కరెంటు తీగలు పట్టుకొని ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆందోళన చేపట్టాడు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతూ తనపై కక్ష గట్టి ఆర్టీవో అధికారులు లారీలపై కేసులు రాసి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. లారీ గతంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నప్పుడు అధికారులు ఆపి కేసు రాశారని, దానికి సంబంధించి జరిమానా శుక్రవారం చెల్లించానని, అదే రోజు మరో లారీకి ధ్రువపత్రాలు లేవని, మళ్లీ కేసు రాశారని వివరించారు. స్థానికులు, పోలీసులు నచ్చ జెప్పడంతో పైనుంచి కిందికి దిగాడు. అయితే జిల్లా రవాణాశాఖ అధికారి రంగారావును వివరణ కోరగా ఏడున్నర నెలల క్రితం ఓవర్ లోడ్ కేసు నమోదైందని, దానికి సంబంధించి జరిమానా చెల్లించాడని, మరో లారీ పత్రాలు సక్రమంగా లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రవాణా అధికారులు మాముళ్ళకు పాల్పడితే కేసు నమోదు చేయరని, ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు



కనగర్తిలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు

కోనరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామ శివారులోని మూలవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పర్మిషన్‌తో నడుస్తున్నప్పటికీ గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇసుకను ట్రాక్టర్లతో తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి ఎద్దడి నెలకొంటుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇసుకను తరలించకుండా అడ్డుకున్నారు. వేరే ప్రాంతం నుంచి ఇసుకకు పర్మిషన్ ఇవ్వాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడడంతో ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన కరీంపేట గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట గ్రామానికి చెందిన గీతకార్మికుడు గుర్రం వీరస్వామి శనివారం సాయంత్రం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు గుజి ఊడిపోవడంతో పట్టు కోల్పోయి చెట్టుపై నుంచి జారుతూ మధ్యలో వచ్చి ఆగాడు. గమనించిన గీత కార్మికులు వీరస్వామిని కిందకు దింపారు. ఈ ప్రమాదంలో వీరస్వామి దంతాలు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



అంజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్న భారత్



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్‌జి

భగత్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నదని సామాజిక, సమరత వేదిక తెలంగాణ ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్‌జీ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళాలో ఆయన మాట్లాడుతూ స్వదేశీ పరిజ్ఞానం, ఆలోచనలతో వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తున్నదన్నారు. దేశం ఆర్థికంగా పురోగతి సాధించాలంటే స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. జపాన్ దేశం అణుబాంబును ఎదుర్కొని అణతి కాలంలోనే ఆర్థికంగా ఎదిగి అమెరికాతో పోటీ పడే స్థాయికి ఎదిగిందన్నారు. భారతదేశం 75 సంవత్సరాల తర్వాత ఆర్థికంగా అభివృద్ధి సాధించి 102 దేశాలకు అన్నపెడుతుందన్నారు. 168 ఆర్థిక ర్యాంకింగ్‌లో ఉన్న దేశం నేడు 5వ స్థానంతో దూసుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ ముక్క హరీష్‌బాబు, కో-కన్వీనర్ కళ్లెం వాసుదేవరెడ్డి, వసంత్ వ్యాలీ కరస్పాండెంట్ ఇనుకొండ బుచ్చిరెడ్డి, సప్తగిరి హైస్కూల్ ఛైర్మన్ నగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్టార్టప్ కంపెనీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, రైతులు

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతులందరూ స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులను, సేవలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతీ నారాయణ్ భట్ అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వారి ఆధ్వర్యంలో అగ్‌మార్క్ అగ్రిటెక్ మార్కెట్ ఆక్సెస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సహ పరిశోధన స్థానం సంచాలకుల ఇంచార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ రూరల్ ఇన్నోవేషన్ స్టాక్స్ అందించే సేవలను అందిపుచ్చుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. శాస్త్రవేత్త రజినీదేవి మాట్లాడుతూ రూరల్ ఇన్నోవేషన్ స్టాక్స్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు స్టార్టప్ సేవలను ఉపయోగించుకునేందుకు, గ్రామ ఆవిష్కరణలకు స్టాక్ అందించే విషయాన్ని వివరించారు. అనంతరం వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. తదనంతరం స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులైన రోబోట్స్, డ్రోన్స్‌ని క్షేత్రప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లోని 11 మంది రైతు ఉత్పత్తిదారుల సంఘాల బాధ్యులు, సీఈవోలు, రైతులు, స్వశక్తి సంఘాల మహిళలతో పాటు అగ్రిహబ్ సీఈవో విజయ్, నాబార్డు కరీంనగర్ ఏజీయం జయప్రకాశ్, ఇన్నోవేషన్ స్టాక్ రూరల్ స్టాక్ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, అగ్రిహబ్ మేనేజర్ ముఖేష్ పాల్గొన్నారు.

కల సాకారం

గోదావరి నదిపై పూర్తయిన సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం



సదర్‌మాట్ బ్యారేజీ

- 18 వేల ఎకరాలకు సాగునీరు
- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల గోదావరి నదిపై సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం పూర్తి కావడంతో అన్నదాతల కల నెరవేరి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామ శివారులో గోదావరి నదిపై సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం 2017 జనవరిలో ప్రారంభించగా ఎట్టకేలకు 2024లో పనులు పూర్తి అయ్యాయి. దీంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో 18 వేల ఎకరాల పంట భూములు సస్యశ్యామలం కానున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.554.28 కోట్ల నిధులు వెచ్చించి బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. పనులు గతేడాది పూర్తి కావాల్సి ఉన్నా వరదలు రావడంతో పాటు, ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆలస్యం అవుతూ వచ్చాయి. బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాలలోని 500 మందికుపైగా రైతులకు చెందిన సుమారు 1230 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, నిర్మల్ జిల్లా మామడ మండలం కమల్‌కోట, పోన్కల్, టెంబుర్ని, ఆదర్శనగర్ గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురికాగా బాధిత రైతులకు గత ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించింది.



బ్యారేజీపై నుంచి రహదారి

తీరనున్న సాగునీటి కష్టాలు

సదర్మాట్ బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాలో 18 వేల ఎకరాల పంట పొలాలు సస్యశ్యామలం కానున్నాయి. జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు, నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందనుంది. సదర్మాట్ బ్యారేజీ కింద గతంలో వేములకుర్తి శివారులో నిర్మించిన గంగానాల ప్రాజెక్టును నింపి అక్కడి నుంచి వివిధ గ్రామాలకు సాగునీరు అందించనున్నారు. గతంలో వేసవిలో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడేవారు. బ్యారేజీ నిర్మాణంతో జిల్లాలోని వేములకుర్తి, యామపూర్, ఫకీర్ కొండపూర్‌తో పాటు మల్లాపూర్ మండలం నడికుడ, మొగిలిపేట, ఒబులపూర్ గ్రామాల రైతులకు రెండు పంటలకు సాగు నీరు అందనుంది. ప్రస్తుతం సదర్‌మాట్ గేట్లు ఓపెన్ చేయడంతో చివరి ఆయకట్టు వరకు రైతులు సాగు చేయడంతో ఆ ప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడుతుంది. సదర్మాట్ బ్యారేజీ పొడవు కిలోమీటర్ ఉండగా బ్యారేజీపై సుమారు 7.5 మీటర్ల వెడల్పుతో వాహనాలు వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. బ్యారేజీకి 55 గేట్లు బిగించారు. నిర్మాణం పూర్తి కావడంతో బ్యారేజీకి జలకళ సంతరించుకుంది.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత ప్రయోజనం

జగిత్యాల-నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల గోదావరి నదిపై సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం పనులు పూర్తి కావడంతో ఈనెల చివరి నాటికి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు యోచిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మార్చి మొదటి లేదా రెండో వారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతుందన్న అభిప్రాయాలను సంబంధిత వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. గోదావరి నదిపై నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత ప్రయోజనం కలగనుంది. ప్రాజెక్ట్ నిర్మాణంతో ఇప్పటికే అక్కడ పర్యాటక శోభ సంతరించుకుంది. నిత్యం రెండు జిల్లాలకు చెందిన పర్యాటకులు ప్రాజెక్టును సందర్శిస్తున్నారు. ప్రభుత్వం చొరవ చూపి అక్కడ పార్క్, హోటల్స్, బోటింగ్‌తో పాటు వివిధ సౌకర్యాలు కల్పించి పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులు, పట్టభద్రులకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అల్గునూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల దశదిశ పేరిట నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎన్నో మంచి పనులు చేసిందని, రెండు లక్షల రుణమాఫీ 90శాతం మందికి వర్తింపజేసిందని అన్నారు. వివిధ సాంకేతిక కారణాలతో 2 లక్షల రుణమాఫీ పొందని 10శాతం మందితో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో లేనపుడే పట్టభద్రులు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిని గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పుటు పార్టీ అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థిని తప్పకుండా గెలిపించుకోవాలని అన్నారు. ఓ అభ్యర్థి దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్నాడని, పట్టభద్రులు, మేధావులు ఆలోచించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అద్భుతమైన పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. తనను గెలిపిస్తే విద్యారంగ అభివృద్ధికి, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడతానని అన్నారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణగౌడ్ ఉన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



సిరిసిల్లలో హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై శనివారం బయల్దేరి వెళ్లినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఈ నెల 17 నుంచి 21 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ సబ్ జూనియర్ పోటీలకు ఇంగ్లీష్ యూనియన్ పాఠశాలకు చెందిన వర్షిత్, ప్రహర్షిత్, గుణభద్రలు ఎంపిక కాగా, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రాజశేఖర్, కోచ్ ప్రేమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొంరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడన్నారు. కులగణన ఓ బోగస్ ప్రక్రియ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ సామాజికవర్గం గురించి మాట్లాడే స్థాయి లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్‌పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన ఓ బోగస్ ప్రక్రియ అని హిందూ, ముస్లిం, బీసీ ముస్లిం అని ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. సర్వే లెక్కలు బోగస్ అనితేలడంతో మళ్లీ సర్వేకు అవకాశం ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలన్నారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ మేయర్లు డి శంకర్, వై సునీల్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వేములవాడకు అదనపు బస్సులు

- మహాశివరాత్రికి ఏర్పాట్లు ● ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. రాజు



భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వేములవాడకు 778 అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ రీజియన్‌లలోని వివిధ డిపోల నుంచి అదనపు బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు తిప్పాపూర్ బస్‌స్టేషన్‌కు 443 బస్సులు, కట్టకింద బస్‌స్టేషన్‌కు 335 బస్సులు నడిపించేందుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేశామన్నారు. వేములవాడతో పాటు, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలతో పాటు, భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం శైవక్షేత్రానికి అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు.

● **కాళేశ్వరం** క్షేత్రానికి మంథని డిపో నుంచి మంథని-కాళేశ్వరానికి 26 బస్సులు నడిపిస్తున్నామన్నారు. భక్తుల రద్దీని బట్టి గోదావరిఖని, కరీంనగర్ నుండి అదనపు బస్సులు నడిపిస్తామన్నారు. వేలాల క్షేత్రానికి గోదావరిఖని డిపో నుండి గోదావరిఖని-వేలాలకు 56 బస్సులు, మంథని డిపో నుంచి మంథని-వేలాలకు 40 బస్సులు నడిపిస్తున్నామన్నారు. అదే విధంగా దుబ్బరాజన్న క్షేత్రానికి జగిత్యాల డిపో నుంచి జగిత్యాల-దుబ్బ రాజన్న రూట్‌లో 50 బస్సులు అదనంగా నడిపిస్తున్నామన్నారు. పొట్లపల్లి క్షేత్రానికి హుస్నాబాద్ డిపో నుంచి హుస్నాబాద్- పొట్లపల్లికి 23 అదనపు బస్సులు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

వేములవాడ బస్‌స్టేషన్ నుంచి ఉచిత బస్సు

మహాశివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వేములవాడ ఆధ్వర్యంలో 14 మినీ బస్సులు వేములవాడ బస్‌స్టేషన్(తిప్పాపూర్) నుంచి వేములవాడ దేవాలయం వరకు ఉచిత ప్రయాణ సేవలు అందిస్తాయన్నారు. భక్తులు వేములవాడ బస్‌స్టేషన్ నుంచి దేవాలయం వరకు తిరుగు ప్రయాణంలో దేవాలయం నుంచి బస్‌స్టేషన్ వరకు ఉచిత బస్సు ప్రయాణ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. భక్తులు వేములవాడ క్షేత్రానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడిపిస్తున్న బస్సు సర్వీసు సేవలను సద్వినియోగం చేసుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకోవాలన్నారు.

● వేములవాడ (తిప్పాపూర్ బస్‌స్టేషన్‌కు)

డిపో	రూటు	బస్సులు
కరీంనగర్-1	కరీంనగర్-వేములవాడ	51
కరీంనగర్-2	కరీంనగర్-వేములవాడ	30
కోరుట్ల	కోరుట్ల-వేములవాడ	62
మెట్‌పల్లి	మెట్‌పల్లి-వేములవాడ	105
వేములవాడ	వేములవాడ-జెబిఎస్	84
వేములవాడ	వేములవాడ-కొండగట్టు జగిత్యాల	21
సిరిసిల్ల	వేములవాడ-వరంగల్	27
సిరిసిల్ల	సిరిసిల్ల-వేములవాడ	25
కరీంనగర్-1	వరంగల్-వేములవాడ	16
కరీంనగర్-2	వరంగల్-వేములవాడ	7
హుజూరాబాద్	వరంగల్-వేములవాడ	15

● వేములవాడ (కట్టకింద బస్‌స్టేషన్‌కు)

డిపో	రూటు	బస్సులు
నిర్మల్	నిర్మల్-వేములవాడ	83
ఆర్మూర్	ఆర్మూర్-వేములవాడ	100
నిజామాబాద్-1	నిజామాబాద్-వేములవాడ	17
కామారెడ్డి	కామారెడ్డి-వేములవాడ	33
నర్సంపేట్-	నర్సంపేట-మహబూబాబాద్ వేములవాడ	30
వరంగల్-1	వరంగల్-వేములవాడ	21
హన్మకొండ	వరంగల్-వేములవాడ	27
పరకాల	పరకాల-వేములవాడ	24

కేజ్ కల్చర్ ఏర్పాటుతో ముదిరాజ్‌లకు నష్టం



చీర్లవంచ శివారులోని మిడ్‌మానేరు వద్ద ముదిరాజ్ సంఘ నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మిడ్‌మానేరు డ్యాంలో కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేస్తే ముదిరాజ్ కులస్థులకు తీరని అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆధారపడిన ముదిరాజ్ కులస్థులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులోని మిడ్‌మానేరు డ్యాంలో అక్వాహబ్ పేరుతో కేజీ కల్చర్‌ను ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని శనివారం జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు, మిడ్‌మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన నిర్వాసితులకు ఉపాధి కరువవుతుందని అన్నారు. అక్వా పేరిట తమ భూములను తీసుకుని మధ్య మానేరు డ్యాంలో కేజ్‌కల్చర్ ఏర్పాటు చేస్తున్నారని దీనిని ముదిరాజ్ కులస్థులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వారికి ఉన్న అనుమతులు ఏమిటో చూపించి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులకు ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా కేజ్ కల్చర్ కంపెనీలో పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయానికి పులిహోర ప్యాకింగ్ మిషన్ వితరణ

- గంటకు 2,100 ప్యాక్ చేసే సామర్థ్యం



పులిహోర ప్యాకింగ్ మిషన్

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రసాదాల పోటులో పులిహోర ప్యాకింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లికి చెందిన పీచర శ్రీహర్షరాజ్యలక్ష్మి అనే అంజన్న భక్తులు రూ.1.55లక్షలతో పులిహోర ప్యాకింగ్ మిషన్ కొనుగోలు చేసి దేవస్థానంకు కానుకగా అందించారు. శనివారం ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహర నాథ్, ప్రసాదాల ఇన్‌చార్జీ శ్రీనివాస్ మిషన్‌ను ప్రారంభించారు. పులిహోర ప్యాకింగ్ మిషన్ దేవస్థానం నిర్దేశిత 200గ్రాముల పులిహోరను గంటకు 2,100 ప్యాకెట్లు చేయనుందని అధికారులు తెలిపారు. దీంతో సిబ్బందికి పనిభారం తప్పడంతో పాటు రద్దీ రోజుల్లో మరింత సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ



ధర్మపురి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడ్డారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వంశీకృష్ణ, విజయ్, నరసింహమూర్తి, నవీన్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతిధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి


సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి


గుండారంలో ప్రత్యేక పూజలు చేస్తున్న గిరిజన నాయకులు


గంభీరావుపేటలో గిరిజనుల ర్యాలీ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను సిరిసిల్లలో గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో గిరిజన సంఘానికి కేటాయించిన స్థలంలో శనివారం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భూక్య రెడ్డినాయక్, కాంగ్రెస్ నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, బొప్ప దేవయ్యలతో పాటు గిరిజన సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గ రాజేశ్వరతండా, బాకురుపల్లితండా, దేవునిగుట్టతండా,గుండారం తదితర గిరిజన గ్రామాల్లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజలు జరిపి భోగ్ బండార్‌ను జరిపించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల తాజా, మాజీ సర్పంచులు, తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండలం బడితండాలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బండితండా గ్రామం నుంచి రుద్రంగి వరకు 200బైక్‌లపైన గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. గామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిలో పాల్గొన్న ప్రభుత్వ విప్

రుద్రంగి మండలం బడితండాలోని సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర కోఆపరేషన్ యూనియాన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డితో కలిసి పత్యేక పూజలు నిర్వహించారు. వారిని గిరిజనులు ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ జనరల్ సెక్రెటరీ జక్కు వంశి, మాజి సర్పంచ్ అల్లూరి మానస, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, జక్కు మోహన్, గండి నారాయణ, తర్రె లింగం, గోపిడి రవీందర్, జక్కుల లక్ష్మణ్, దీలీప్ పాల్గొన్నారు. కాగా, బడితండాలో సేవాలాల్ మహారాజ్ జయంతిలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రశాంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి, మాజీ వైస్ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, రామ్‌దాస్, శ్యామ్‌సుందర్, పాల్గొన్నారు.

● గంభీరావుపేట :మండలంలోని జగదాంబ తండాలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. బోగ్ కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం జగదాంబ తండా నుండి గంభీరావుపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తండావాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


లాల్ సింగ్ తండాలో గిరిజనుల ర్యాలీ

● వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలోని అన్ని గ్రామాలతో పాటు తండాల్లో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. స్వామివారికి, మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల గిరిజనులు సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి బండారు కార్యక్రమాన్ని నిర్వహించారు. బంజారాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మార్వో మారుతి రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఎస్సై ఎల్లయ్య గౌడ్, మాజీ జెడ్పీటిసి కళావతి, మాజీ ఎంపీపీ భూల, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, పలు తండాల్లోని నాయక్‌లు, గిరిజనులు పాల్గొన్నారు.

'ఉపాధి' యాక్షన్ ప్లాన్ సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అవసరమైన నిధులపై కూడా ప్రణాళికలు రూపొందించారు. ఉపాధితో పాటు నీటిపరిరక్షణ, నీటి నిల్వ, మొక్కలు నాటడం, కరువు నివారణ పనులు, సూక్ష్మ చిన్నతరహా సాగునీటి పనులు, కాలువల నిర్మాణం వంటి పనులతో పాటు ఫాంపాండ్‌లు, పొలంబాటలు, ఎస్సీ, ఎస్టీ భూముల అభివృద్ధి, చెక్‌డ్యాంలు, గేదెలు, పౌల్ట్రీషెడ్‌లు, కమ్యూనిటీ వాటర్ హార్వెస్టింగ్, ఫిషరీస్ ఫాండ్‌లు వంటి పనులను కూడా గుర్తించారు.

● ఉపాధి పనిదినాల లక్ష్యం 26.75 లక్షలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధిహామీ కూలీలకు 2025-2026 సంవత్సరానికి 26లక్షల 75 వేల 383 పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఏప్రిల్ మాసంలో 4,36,477 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. మే నెల వరకు 8,65,202 పనిదినాలు, జూన్‌వరకు 11,19,603 పనిదినాలు,జూలై వరకు 12,31,258 పనిదినాలు, ఆగస్టు వరకు 13,37,300 పనిదినాలు, సెప్టెంబరు వరకు 14,43,862 పనిదినాలు, అక్టోబరు వరకు 15,58,084 పనిదినాలు, నవంబరు వరకు 16,92,632 పనిదినాలు, డిసెంబరు వరకు 18,42,542 పనిదినాలు, 2026 సంవత్సరంలో జనవరి వరకు 20,25,122 పనిదినాలు, ఫిబ్రవరి వరకు 23,08,391 పనిదినాలు, మార్చి వరకు పూర్తిగా 26,75,383 పనిదినాల లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశారు.

భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి

వేములవాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంత్ సేవాలాల్ జయంతి వేడుకల కోసం ప్రభుత్వం కేటాయించిన భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గిరిజన మహిళలు విజ్ఞప్తి చేశారు. శనివారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు వారు వినతి పత్రం అందజేశారు. 2006 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం గిరిజనుల వేడుకల కోసం ఎకరం 13 గుంటలను కేటాయిస్తే కొందరు వ్యక్తులు దీనిని అక్రమంగా అమ్ముకున్నారంటూ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అన్యాక్రాంతమైన భూమిపై విచారణ జరిపి న్యాయం చేయాలని వారు కోరారు. దీనిపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందిస్తూ అప్పటి ప్రభుత్వం కేటాయించిన భూమి ఎంత, ప్రస్తుతం ఎంత ఉంది అనే విషయమై కొలతలు వేసి హద్దులు చూసిన తర్వాత భూమి అన్యాక్రాంతమైనట్టు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న యారన్ సబ్సిడీలను విడుదల చేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల శాంతినగర్‌లోని పద్మశాలీ సంఘ భవనంలో శనివారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాలిస్టర్ యాజమానులతో చర్చలు జరిపి కార్మికులకు కూలీ పెంచాలన్నారు. సిరిసిల్లలో 2023లో మరమగ్గాల కార్మికులు తయారుచేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన పదిశాతం యారన్ సబ్సిడీని అందించాలన్నారు. మరమగ్గాల కార్మికుల కోసం ఏర్పాటుచేసిన వర్కర్ టూ ఓనర్ పథకాన్ని ప్రారంభించడంతో పాటు ప్రభుత్వం అందించిన ఆర్డర్‌లకు కూలీని పెంచాలన్నారు.

శాంతినగర్ ఏరియా కమిటీ ఎన్నిక

సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్ ఏరియా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ కమిటీని ఎన్నుకున్నట్లు రమేష్ తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా నక్క మల్లేశం, అధ్యక్షులుగా యేన్నం లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా గూట్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా సబ్బని శ్రీకాంత్, బోగ వెంకటేశం, సహాయ కార్యదర్శులుగా నగిశెట్టి మల్లేశం, బాసబత్తిని ప్రభాకర్, సభ్యులుగా గోనే సత్యనారాయణ, చింతకింది రాజేశం, యోన్నం నిరంజన్, నక్క మల్లేశం, అకెన రత్నాకర్, వేముల శ్రీధర్, అకెన సత్తయ్యలను ఏకగ్రీవం ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

- మృతులకు నివాళులర్పించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

సిరిసిల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సమగ్ర శిక్ష ఉద్యోగుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇప్పపూల దేవయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగుల రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులైన రమేష్, శ్రీనివాస్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు దేవయ్య, ఉపేందర్, కయ్యూం, వెంకటస్వామి, దేవరాజు, నరేందర్, శ్రీనివాస్, మల్లేశం, తిరుపతి, జాగిరి శ్రీనివాస్, చందన్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్ఎస్ఏ జేఏసీ మండల అధ్యక్షులు దేవరాజు అన్నారు. చందుర్తి మండల విద్యా వనరుల కేంద్రంలో భోజన విరామ సమయంలో మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులైన రమేష్ నాయక్, శ్రీనివాస్‌ల చిత్రపటాలకు పూలమాలవేసి శనివారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వినయ్ కుమార్, తిరుపతి, జ్యోతికుమార్, కల్పన, మంజుల, అమిన, జ్యోతి, అమృత తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

న్యూస్ బాక్స్

బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు కోళ్లకు లేవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశు వైద్యాధికారి రాహుల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, దుమాల, అక్కపల్లి, నారాయణపూర్, కోరుట్లపేట తదితర గ్రామాల్లోని కోళ్ల ఫారాలను శనివారం ఆయన క్షేత్ర స్థాయిలో సందర్శించారు. కోళ్ల ఫారంలోని కోళ్లను పరిశీలించారు. ప్రబలుతున్న వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు జాగ్రత్తలను వివరించారు. బర్డ్ ఫ్లూ లక్షణాలు ఏం లేవని కోళ్ల పెంపకందారులు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని అన్నారు. కోళ్లు చనిపోతే తమకు సమాచారం అందించాలని పశు వైద్యాధికారి రాహుల్ కోరారు.

నిరుపేదల కుటుంబానికి బియ్యం వితరణ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని నిరుపేద యువతి వివాహానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలోని నాయకులు శనివారం 50 కిలోల బియ్యం వితరణ చేశారు. గ్రామంలోని నిరుపేద దాసారపు రమేశ్ మృతి చెందగా ఆయన కూతురు పెళ్లికి తమ వంతు సాయం అందించారు. గ్రామానికి చెందిన మ్యాకల గంగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆయన కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మురళీమోహన్‌గౌడ్ 50 కిలోల బియ్యం అందజేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సుధాకర్, సాయి, మల్లేశం, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు దారి కల్పించాలి

గంభీరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట అంబేద్కర్ నగర్ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలకు దారి కల్పించాలని శనివారం ఎంపీడీవోకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గతంలో పాఠశాలకు ఉన్న దారికి అడ్డంగా గోడను నిర్మించారని వినతి పత్రంలో కోరారు. ఫలితంగా పాఠశాలకు వెళ్లే కాలి నడకన వెళ్లేందుకు బాట దారి లేకుండా అయిందని పేర్కొన్నారు. గోడ నిర్మించి 20ఏళ్లుగా ఉన్న దారిని మూసివేశారని ఎంపీడీవోకు వినతి ద్వారా విన్నవించారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా పాఠశాలకు తిరిగి దారి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేందర్‌ను కోరారు.

వాహనదారులు సరైన ధ్రువ పత్రాలు కలిగి ఉండాలి

వీర్నపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): : వాహనదారులు వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని ఎస్ఐ ఎల్లయ్య గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో పోలీసులు వాహన తనిఖీలను శనివారం నిర్వహించారు. తనిఖీలు నంబర్ ప్లేట్ లేని వాహనాలను పట్టుకొని వాహనదారుల చేత నంబర్ ప్లేట్‌లను బిగించి జరిమానాలు విధించారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా, నకిలీ నంబర్ ప్లేట్లతో నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వాహనాల చలానాలు కట్టించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సీజ్ చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, సిబ్బంది కార్తీక్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పదవీ కాలం పొడిగింపు



విలేకరులతో మాట్లాడుతున్న సహకార సంఘాల అధ్యక్షులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకార సంఘాల పదవీకాలం పొడిగించారని తెలంగాణ సహకార సంఘాల అధ్యక్షులు పేర్కొన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇందుకు సహకరించిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు. సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రస్తుత పరిస్థితులను ముఖ్యమంత్రి అర్థం చేసుకొని తమ పదవీ కాలం పొడిగించారన్నారు. రైతులకు రుణాలు, ఎరువుల పంపిణీ, వరి ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా రైతులందరికి అందుబాటులో ఉంటామన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, సిరిసిల్ల, కొలనూరు సహకార సంఘాల అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, బండ నర్సయ్య, బండి దేవదాస్, సంకినేని రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

● గంభీరావుపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్, డైరెక్టర్ పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించడం పట్ల గంభీరావుపేట సింగిల్ విండో వైస్‌చైర్మన్ ఎర్ర రామాంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి, డైరెక్టర్ మల్యాల రాజ్‌వీర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు గౌడు, మల్యాల రాజవీరు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బారా ఎల్లవ్వ ధనరాజ్, అజ్మీర భీమ్లా, మద్దుల రమణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర కిషన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఈడిగి పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని స్థానిక ఓ ఫంక్షన్ హాలులో రెడ్డి ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డిని శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. దేవిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, సత్యంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి'

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులు, ఉపాధ్యాయులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలంటే జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలల్లో తమ ఓట్లతో బుద్ధి చెప్పాలని బీజేపీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బాస సత్యనారాయణ కోరారు. తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులతో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పట్టభద్రుల స్థానం నుంచి డాక్టర్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి ముల్క కొమురయ్యలు బీజేపీ నుంచి బరిలో ఉన్నారని, వీరి గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, సందవేణి రాజుయాదవ్‌తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు రాజన్నపేట, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆహార భద్రత అధికారులు శనివారం సందర్శించారు. వంటగదులు, నిల్వ చేసిన బియ్యం, పప్పులు, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. రుచికరమైన ఆహారం అందించాలన్నారు. హెచ్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎన్వీ సుభాష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సమావేశానికి హాజరైన సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతినెల నిరుద్యోగులకు జీవన భృతికింద ప్రతి నెల రూ.4వేలు ఇస్తామని నిరుద్యోగులందరికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఒక్క ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. పట్టభద్రులకు ఎలాంటి ఉపాధిని చూపకుండా నిరుద్యోగ భృతి కూడా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వంపై పట్టభద్రులు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. నిరుద్యోగులు, పట్టభద్రులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికలల్లో తమ ఓట్లతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. విద్యార్థుల, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడింది కేవలం బీజేపీ అని అన్నారు. ప్రస్తుతం జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు డాక్టర్ అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి బాసా సత్యనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రెడ్డబోయిన గోపీ, రేగుల మల్లికార్జున్, పార్లమెంట్ కో-కన్వీనర్ అడెపు రవీందర్, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కారెడ్ల మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

● వేములవాడ టౌన్ : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడ ఎర్రం మహేష్ అన్నారు. వేములవాడ అర్బన్ మండల బీజేపీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్డి భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రం మహేష్ మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను గెలిపించాలని కోరారు. ఎన్నికల హామీల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చలేదని వాటిని ఎండగట్టాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్, సీనియర్ నాయకులు లింగంపల్లి శంకర్, ఏరెడ్డి రాజిరెడ్డి, రేగుల పర్శరాములు, వేముల నాగరాజు, గుంటి వైకుంఠం, ప్రశాంత్, అంజయ్య, గుండెకర్ల లక్ష్మణ్, జింక శ్రీనివాస్, నాంపల్లి అరవింద్, పోచంపల్లి శ్రీకాంత్, గుంట మహేష్, నాగుల పూర్ణచందు, బొల్లు తిరుపతి తదితరులు ఉన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం..


రెడ్డి సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గుండారపు కృష్ణారెడ్డి, నల్ల నాగిరెడ్డిలను ఎన్నుకోగా శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో తొమ్మిది మందితో కూడిన సంఘం పూర్తికార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి నల్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు(మహిళా విభాగం) మడుపు ప్రమోదరెడ్డి, ఉపాధ్యక్షులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, నరెడ్ల రాఘవరెడ్డి, కూతురు వెంకటరెడ్డి, డబ్బు తిరుపతిరెడ్డి, గడ్డమీది ప్రసాద్‌రెడ్డి, గుల్లపల్లి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. జిల్లా సంయుక్త కార్యదర్శి(మహిళా విభాగం) దుంద్రు జలజారెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ముసుకు తిరుపతిరెడ్డి, ఏమిరెడ్డి కనకరెడ్డి, జువ్వెంతుల లక్ష్మారెడ్డి, మంద బాల్‌రెడ్డి, కోశాధికారి ఎద్మల హనుమంతరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ(మహిళా విభాగం) బీమా నీలిమారెడ్డి, ప్రచార కార్యదర్శులు గడ్డం సత్యనారాయణరెడ్డి, బిచ్చల రాజిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా ప్రేమ్‌సాగర్, కంకణాల శ్రీనివాస్‌రెడ్డి, కంకణాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల రాజిరెడ్డి, కంది భాస్కర్‌రెడ్డి, కరెడ్ల మల్లారెడ్డి, అబ్బాడి తిరుపతిరెడ్డిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ రవాణా అంటూ సోషల్ మీడియా వేదికగా వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని తహసీల్దార్ సుజాత అన్నారు. లింగంపల్లిలోని మూలవాగులో ప్రభు త్వ అనుమతులతో ఏర్పాటుచేసిన ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలి స్తున్నారని మహేందర్ అనే వ్యక్తి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేశాడన్నారు. ట్రాక్టర్ యజమానులు, కూలీలకు డబ్బుల విషయంలో జరిగిన వాగ్వాదాన్ని అక్రమ ఇసుక రవాణా అని తప్పుడు ప్రచారం చేశారన్నారు. తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయడం కోసం ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ శివారులోని కళాశాలలో అంతర్జాతీయ నేషనల్ గర్ల్స్ చైల్డ్ డే సందర్భంగా ముందస్తుగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఫోకస్ ఆన్ సైన్స్ అండ్ టెక్నాలజీలో గర్ల్స్ ఇన్ స్టెమ్ అనే అంశంపై శనివారం విద్యార్థినులు సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుమలత, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ సంధ్యారాణి, ఆయేషా ఫాతిమా, అనూష, తదితరులు ఉన్నారు.

'కృష్ణవేణి'లో ఎడ్యుకేషన్ సైన్స్‌ఫెయిర్

- ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


నమూనాలను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) :రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ సైన్స్‌ఫెయిర్‌ను శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. సుమారు 180 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రైమరీ నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు ప్రదర్శనలో తమ నమూనాలను ప్రదర్శించగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తల్లిదండ్రులు, స్థానిక పాఠశాలల విద్యార్థులు తిలకించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ సైన్స్‌ఫెయిర్ వల్ల విద్యార్థుల్లో సాంకేతిక, వైజ్ఞానిక, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. రాబోవు రోజుల్లో శాస్త్రవేత్తలు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తిపిరెడ్డి వేంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.